పల్లెలకు ప్రగతి అడుగులు

జిల్లాకు రూ.96 కోట్లు మంజూరు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: దేశానికి పల్లెలే పట్టుగొమ్మలని, గ్రామ స్వరాజ్యమే దేశ సౌభాగ్యమని గాంధీజీ దృఢంగా విశ్వసించారు. గత వైకాపా ఐదేళ్ల పాలనలో గ్రామ ప్రగతిని పాతాళానికి తొక్కేశారు. వాటికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను ఇతర పథకాలకు మళ్లించారు. కనీసం పంచాయతీలకు విద్యుత్తు బకాయిలు కూడా చెల్లించలేని పరిస్థితికి తీసుకువచ్చారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక పల్లెలకు మంచి రోజులు వచ్చాయి. గ్రామసభల నిర్వహణ ఫలితంగా గ్రామానికి ఏఏ పనులు కావాలి, వాటికి ఎంత నిధులు అవసరం, ఉపాధిహామీ పథకంలో ఎన్నింటికి ఎంత అవసరం అని ప్రతిపాదనలు పెట్టాలి, తదితర అంశాలపై గ్రామసభలు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల పరిధిలో 467 పంచాయతీల్లో రూ.96 కోట్లతో ఉపాధిహామీ పథకం నిధులతో 1,613 పనులు చేపట్టనున్నారు. అవసరమైన పనులు చేపట్టేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

కూటమి రాకతో..

తెదేపా కూటమి అధికారం చేపట్టిన వెంటనే పంచాయతీల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేసింది. జిల్లాలకు 1,613 పనులకు రూ.96 కోట్లు ఉపాధి నిధులు కేటాయించారు. అంతర్గత రహదారులు, నీటి సంరక్షణ చర్యలు, సీసీ, బీడీ రహదారులు, మురుగు కాలువలు, ఉద్యానాల అభివృద్ధి, పాఠశాలలకు ప్రహరీలు, కల్వర్టుల నిర్మాణం, శ్మశానాల్లో దహన వాటిక ఏర్పాటుతో పాటు తదితర పనులు చేపట్టనున్నారు. ఈ పనులు చేపట్టేందుకు మండలానికి రూ.3 కోట్లు చొప్పున కేటాయింపులు చేశారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు.

14 నుంచి పనులు ప్రారంభిస్తాం

గ్రామసభల్లో జరిగిన చర్చ ఆధారంగా జిల్లావ్యాప్తంగా 1,613 పనులకు రూ.96 కోట్లు నిధులు మంజూరయ్యాయి. మండలానికి మూడు కోట్లు చొప్పున నిధులు కేటాయింపులు జరిగాయి. ఈ నెల 14 నుంచి గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నాం. - **మురళి, పంచాయతీరాజ్, ఈఈ**

దసరా శరన్నవరాత్రులకు
సర్వం సిద్ధం

6 నుంచి వేదపురుష సప్తాహజ్ఞాన యజ్ఞం


ప్రత్యేక అలంకరణలో సాయికుల్వంత్ మందిరం


పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రశాంతి నిలయంలో దసరా శరన్నవరాత్రులకు ట్రస్టు వర్గాలు సర్వం సిద్ధం చేశాయి. ఈనెల 6 నుంచి 12 వరకు వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సాయికుల్వంత్ మందిరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ వేదపురుష సప్తాహజ్ఞాన యజ్ఞం ప్రశాంతి నిలయంలో 6 నుంచి ప్రారంభం కానుంది. ఏటా విజయదశమి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని యజ్ఞం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయికుల్వంత్ మందిరంలో కలశస్థాపనతో వేడుకలు ప్రారంభమవుతాయి. 6న పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఉదయం 7 గంటలకు వేద పురుష సప్తాహజ్ఞానాన్ని 27 మంది వేదపండితులు నిర్వహించనున్నారు. సాయిసన్నిధిలో వేడుకలను తిలకించడానికి వేలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. ట్రస్టు వర్గాలు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాయి.

విజయదశమికి వంద ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి: విజయదశమి పండగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లా నుంచి వంద బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈనెల 9 నుంచి 12 వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి 30, బెంగళూరు 20, తిరుపతి 10, చెన్నై 5, విజయవాడ 5 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతపురం నుంచి పుట్టపర్తికి 30 బస్సు సర్వీసులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు.

భూకబ్జాదారుల్లో దడ


- గత వైకాపా ప్రభుత్వ 'ఫ్రీహోల్డ్'పై పునఃపరిశీలన
- ఐదోతేదీ నాటికి నిగ్గుతేలే అవకాశం



అనంత జిల్లాలో డివిజన్ల వారీగా ఫ్రీహోల్డ్ భూమి వివరాలు

డివిజన్	గ్రామాలు	యజమానులు	ఎకరాలు
అనంతపురం	38	2,083	9,113.56
గుంతకల్లు	27	638	1,892.162
కళ్యాణదుర్గం	34	3,203	12,393.462

ఉమ్మడి జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల వివరాలు (ఎకరాల్లో)



జిల్లా సచివాలయం, (న్యూస్‌టుడే): ఉమ్మడి అనంతపురం జిల్లాలో అసైన్డ్ భూముల బాగోతాన్ని నిగ్గు తేల్చడానికి యంత్రాంగం నడుం బిగించింది. ఈనెల 5వ తేదీలోపు నిర్ధారించేందుకు క్షేత్ర పరిశీలన ముమ్మరంగా నడుస్తోంది. గత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజాప్రతినిధులు, నాయకులు భూదందా సాగించిన సంగతి తెలిసిందే. చట్ట సవరణ ముసుగులో.. వేలాది ఎకరాలను 'నిషేధిత జాబితా' నుంచి తొలగించి.. ఆగమేఘాలపై అమ్ముకుని రూ.కోట్లు దిగమింగారు. పేదల జీవనాధరమైన అసైన్డ్ భూములను గుట్టుచప్పుడు కాకుండా అవినీతి అధికారులతో చేతులు కలిపి బినామీ పేర్లతో దోచుకున్నారు. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లూ భూదందా సాగించారు. ఇదే అదనుగా సార్వత్రిక ఎన్నికలకు మూడు మాసాల ముందు ఎడాపెడా అసైన్డ్/చుక్కల భూములను 22ఏ నిషేధి జాబితా(ఫ్రీ హోల్డ్) నుంచి విముక్తి కల్పించారు. గతేడాది డిసెంబరు 19న జీవో 596ను పేదల ప్రయోజనాల కోసమంటూ తెచ్చిన భూచట్ట సవరణను అధికార వైకాపా నేతలు అనుకూలంగా మలుచుకున్నారు. కనీసం 20ఏళ్లకుపైగా అసైన్డ్, వంక పోరంబోకు.. ఇలా ప్రభుత్వ భూమి డి.పట్టా ఆధారంగా సాగు చేసుకుంటున్న పేదలకు శాశ్వత భూయాజమాన్య హక్కులు కల్పిస్తామని దగా చేశారు. ఇందులో వైకాపా నేతలే భూకబ్జాలకు పాల్పడి రూ.కోట్లు లబ్ధి పొందారన్నది నిష్ఠూర సత్యం. ఈ అక్రమ బాగోతాన్ని తేల్చడానికి తెదేపా కూటమి ప్రభుత్వం పునఃపరిశీలనకు శ్రీకారం చుట్టింది.

'సత్యసాయి'లోనే అత్యధికం

నిషేధి జాబితా నుంచి విముక్తి పొందిన భూమి అత్యధికంగా శ్రీసత్యసాయి జిల్లాలోనే ఉండటం విశేషం. రాష్ట్రంలోనే ఈ జిల్లా రెండో స్థానంలో ఉంది. జిల్లా విభజన తర్వాత వైకాపా ప్రజాప్రతినిధులు ఇబ్బడిముబ్బడిగా తహసీల్దార్లను అడ్డుపెట్టుకుని వేలాది ఎకరాలు కొట్టేశారు. జిల్లాలో మొత్తం 1,92,174 ఎకరాలు నిషేధి జాబితా నుంచి తొలగించారు. ఇందులో 2,997 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గమనార్హం. ఎక్కువగా ధర్మవరం, బత్తలపల్లి, హిందూపురం, సోమందేపల్లి, చిలమత్తూరు, కదిరి, గోరంట్ల, పెనుకొండ, ముదిగుబ్బ, పుట్టపర్తి మండలాలు ఉన్నాయి. తాజా పునఃపరిశీలనలో ఆయా ప్రాంతాల్లో లోతుగా ఆరా తీస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో వైకాపా ఎమ్మెల్యేల్లో ఒకరు చేసిన భూకబ్జాలకు హద్దులేకుండా పోయింది. ఈయనతో అంటకాగిన ఓ తహసీల్దారు సైతం సస్పెండ్‌కు గురి కావాల్సి వచ్చింది. బినామీ పేర్లపై సదరు ఎమ్మెల్యే వేలాది ఎకరాలను కొట్టేశారు.

అనంతలో 30వేల ఎకరాలు

అనంత జిల్లా పరిధిలో అసైన్డ్/చుక్కల భూమి 2,22,902 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖ తేల్చింది. వైకాపా పాలనలో 23,399 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఇందులో 99.679 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయినట్లు తేలింది. రిజిస్ట్రేషన్ అయిన ఫ్రీహోల్డ్ భూములే కాకుండా నిషేధిత జాబితా నుంచి తొలగించిన దానిపై పునఃపరిశీలన సాగుతోంది. మూడు రెవెన్యూ డివిజన్లల్లో ఎక్కువగా కళ్యాణదుర్గం పరిధిలోనే దందా సాగింది. ఇక్కడ 3203 మంది యజమానులకు చెందిన 12,393 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అనంత డివిజన్‌లో 2083 మందికి చెందిన 9113 ఎకరాలు ఉంది. అనంత గ్రామీణం, రాప్తాడు, ఆత్మకూరు, కూడేరు, నార్పల, శింగనమల, బీకే సముద్రం, గార్లదిన్నె, కళ్యాణదుర్గం, గుత్తి, పామిడి.. వంటి ప్రాంతాల్లో ఎక్కువగా భూదందా నడిచినట్లు స్పష్టమవుతోంది.

సి'ఫార్సు'లో దందా

చుక్కలు, అసైన్డ్ భూములు 22ఏ నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించాలంటే క్షేత్ర స్థాయి నుంచి దస్త్రాలు నిర్వహించాలి. వీఆర్ఓ, తహసీల్దారు, ఆర్డీఓ.. ఇలా దస్త్రాలు కలెక్టరేట్‌కు చేరాలి. క్షేత్ర స్థాయిలోని రెవెన్యూ అధికారులను లోబరుచుకుని కబ్జాదారులు పక్కా ప్రణాళికతో నడిపించారు. అక్కడి నుంచే సిఫార్సులు చేయించుకున్నారు. దళిత, గిరిజనుల వద్ద ఉన్న అసైన్డ్ భూముల డి.పట్టాలను భయపెట్టి.. బెదిరించి లాక్కున్నారు. అంతోఇంతో చేతికి ఇచ్చి పక్కకు తోసేశారు. దీనికి రెవెన్యూ యంత్రాంగం సహకరించింది. ఇదంతా పక్కా ప్రణాళికతో ముగించారు. ఇపుడు తెదేపా కూటమి ప్రభుత్వం ఈ తరహా భూములపై దృష్టి సారించింది. మదనపల్లి దస్త్రాల వ్యవహారం తెరపైకి వచ్చిన తర్వాత.. అసలు బాగోతం వెలుగుచూస్తోంది.

కమ్మేసిన కరవు ఛాయలు

- కీలక దశలో పంటలు ఎండుముఖం
- నష్టపోతున్న అన్నదాతలు

ఈనాడు, అనంతపురం, తలుపుల

ఓ వైపు ఆకాశం మేఘావృతమై ఉంటున్నా.. చినుకులు పడటం లేదు. అధిక వర్షపాతం నమోదైనా.. పంటలకు అదును లేకుండా పోయింది. ఎంతో కీలకమైన సెప్టెంబరులో వర్షాభావంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుసెనగ, కంది, ఆముదం, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పంట ఎదుగుదల నిలిచిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడు వర్షాలు కురిసినా పంట చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సరైన వర్షాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఫలితంగా బోర్లలోనూ నీరు తగ్గిపోయి.. వాటి కింద సాగు చేసిన పంటలు చాలా చోట్ల ఎండిపోయాయి. ఈ జిల్లా వేరుసెనగకు పెట్టింది పేరు. దిగుబడి సంగతి దేవుడెరుగు కనీసం పశుగ్రాసం వచ్చే అవకాశం లేదని కర్షకులు వాపోతున్నారు. పత్తిలో 40 శాతం దిగుబడి రావడం కష్టమే అంటున్నారు. కంది, ఆముదం పంటలదీ అదే పరిస్థితి. రెండేళ్లుగా ఇదే తీరు ఉండటంతో రైతులు సాగుపై ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షలాది ఎకరాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.

పశుగ్రాసమూ దక్కేలా లేదు..



అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామినేపల్లికి చెందిన ఆనంద్.. రెండు ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. ఆగస్టులో వర్షానికి పంట ఆశాజనకంగా ఎదిగింది. సెప్టెంబరులో కాయలు దిగే సమయానికి వర్షాలు లేక దిగుబడి పూర్తిగా పడిపోయింది. చెట్టుకు కనీసం నాలుగైదు కాయలు రాలేదు. విత్తనానికే రూ.12 వేలు, సాగుకు మరో 20 వేలు ఖర్చు చేసినట్లు ఆనంద్ చెబుతున్నారు. ప్రస్తుతం పంట ఎండుముఖం పట్టింది. పశుగ్రాసం కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు.


రెండు బోర్లూ అడుగంటాయి



శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం చదులవాండ్లపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి 3.5 ఎకరాల్లో వరి సాగు చేశారు. పొలంలో రెండు బోర్లు ఉన్నాయి. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో రెండు బోర్లూ అడుగంటిపోయాయి. వాటికింద సాగుచేసిన వరి ఎండిపోయింది. ఎకరానికి రూ.30వేలు చొప్పున రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు రామ్మోహన్‌రెడ్డి చెబుతున్నారు. ఇంటిల్లిపాది రెక్కల కష్టంతో సాగు చేసిన పంట కళ్లముందే ఎండిపోతుంటే కన్నీళ్లు ఆగడం లేదని వాపోతున్నారు.

వేరుసెనగ, పత్తిపై ప్రభావం

అనంతపురం జిల్లాకు సంబంధించి ఖరీఫ్‌లో 2.9 లక్షల ఎకరాల్లో వేరుసెనగ సాగైంది. పత్తి 72 వేల ఎకరాలు, 1.44 లక్షల ఎకరాల్లో కంది సాగు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో వేరుసెనగ 96 వేల ఎకరాలు, కంది 23 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ జులై, సెప్టెంబరు మాసాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జులైలో 62 శాతం, సెప్టెంబరులో 56 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ చివరిలో విత్తుకున్న పంటలు సెప్టెంబరు నాటికి కాయ దశకు చేరుకుంటాయి. ఊరే సమయంలో వర్షాలు లేకపోవడంతో వేరుసెనగ, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. పత్తిలో 80 నుంచి 90 కాయలు ఉండాల్సి ఉండగా.. కనీసం 20 కాయలు రాలేదు. వేరుసెనగ చెట్టుకు 5 కాయలు కూడా కనిపించడం లేదు.



అడుగంటిన భూగర్భ జలాలు

ఉమ్మడి అనంత జిల్లాలో భూగర్భ జలాలు 12.26 మీటర్ల లోతుకు పడిపోయాయి. గతేడాది వర్షాలు లేకపోవడంతో బోర్లు రీఛార్జ్ కాలేదు. దీనికితోడు వైకాపా ఐదేళ్ల పాలనలో భూగర్భజలాల పెంపునకు కనీస చర్యలు తీసుకోలేదు. చెక్‌డ్యాంలు, నీటి కుంటలు, పంట కుంటల నిర్మాణంపై శ్రద్ధ చూపలేదు. హంద్రీనీవా నీటితో ఇక్కడి చెరువులు నింపకుండా... నేరుగా పుంగనూరు తీసుకెళ్లడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బోర్ల కింద పంటలు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. బోర్లల్లో నీరు తగ్గిపోవడంతో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు
వెలకట్టలేనివి: మంత్రి


పెనుకొండలోని మార్కెట్‌లో చెత్త ఊడుస్తున్న మంత్రి సవిత తదితరులు

పెనుకొండ, న్యూస్‌టుడే: సమాజంలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీ కూడలిలో మంత్రి సవిత ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గాంధీ కూడలిలో శాంతి కపోతం ఎగురవేశారు. వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి స్థానిక మహిళా సమాఖ్యలు ప్రగతి, రేవతి, బాబాఫక్రుద్దీన్, దాదాపీర్, బాబా, అరుంధతి, శ్రీలక్ష్మీ సమాఖ్యలు కలసి రూ.1.5లక్షల మెగా చెక్కును మంత్రికి అందజేశారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా నగరపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో కలసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో కార్మికులతో కలసి మంత్రి చెత్త ఊడ్చారు. నగరపంచాయతీలో పనిచేస్తున్న 30మంది పారిశుద్ధ్య కార్మికులకు పోత్సాహక బహుమతులు అందజేశారు.

యువతకు ఆదర్శం గాంధీ జీవితం


గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్ తదితరులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ జీవిత చరిత్ర యువతకు ఆదర్శమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్య పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకటనారాయణ, వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకోని
ప్రభుత్వ ఆసుపత్రి

వెనుదిరిగిన రోగులు


ఇందిరానగర్‌లోని పట్టణ ఆరోగ్యకేంద్రం


నిరీక్షిస్తున్న మహిళ

హిందూపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సెలవు రోజైన వైద్యాధికారి లేదా స్టాఫ్ నర్సు ఆసుపత్రిలో అందుబాటులో ఉండి అత్యవసరంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యసేవలు అందించాలి. బుధవారం మహాత్మాగాంధీ జయంతి అని పట్టణం ఇందిరానగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు మూసివేశారు. ఆసుపత్రిలో ఒక వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది ఉన్నప్పటికీ ఒక్కరూ అందుబాటులో లేక పోవటం గమనార్హం. ఇందిరనగర్‌కు చెందిన షమీన్‌బీ తీవ్ర ఛాతినొప్పితో ఆసుపత్రిలో చికిత్స చేయించుకొనేందుకు వచ్చి కొంత సమయం నిరీక్షించినా ఆసుపత్రి తలుపులు తెరవక వైద్యుడు, సిబ్బంది అందుబాటులోలేక పోవటంతో ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. ఈ విషయంపై పట్టణ ఆరోగ్య కేంద్రాల నోడల్ అధికారి డా.పద్మజను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రభుత్వ సెలవు రోజైనా ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఎందుకు మూసివేశారో విచారణ చేస్తానన్నారు.

దీపావళికే..
వంటింట వెలుగులు

- ఉచితంగా మూడు సిలిండర్ల పంపిణీ
- పౌరసరఫరాల శాఖ కసరత్తు ప్రారంభం


- అంశం : ఉచిత గ్యాస్ సిలెండర్లు
- గ్యాస్ ఏజెన్సీలు : 87
- జనరల్ కనెక్షన్లు : 7,48,218
- దీపం, ఉజ్వల పథకాలు : 4,38,242
- ఇతర కంపెనీలవి : 68,451

అనంతపురం(కళ్యాణదుర్గం రోడ్డు), పుట్టపర్తి న్యూస్‌టుడే:

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో.. సూపర్ సిక్స్ పథకాలు అమలులో భాగంగా మహాశక్తి పథకం కింద పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని దీపావళి పండగ నుంచి అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం కింద ఏడాదికి మూడు సిలిండర్లు పంపిణీ చేయాలని హామీ ఇచ్చారు. ఆ దిశగా పౌర సరఫరాలశాఖ కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12,54,911 గృహ వినియోగ వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో దీపం, ఉజ్వల పథకాల కింద, ఇతర ప్రభుత్వ పథకాల కింద తీసుకున్నవారిలో తెల్లకార్డుదారులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తే 12,08,293 కార్డుదారులున్నారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణాల్లో ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తున్నారు. ఏడాదికి ఎంత ఖర్చవుతోంది? ఆయా రాష్ట్రాల్లో ఎలా అమలు చేస్తున్నారు? విధి విధానాలపై పౌర సరఫరాలశాఖ కసరత్తు చేసి నివేదిక సిద్ధం చేసింది. శాసనసభ కమిటీలో మంత్రులు కూడా చర్చించి నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి విధివిధానాలను వెల్లడించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

12.54 లక్షల కనెక్షన్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 12,54,911 వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్లకార్డుదారుల ప్రాతిపదికగా తీసుకుంటే ఇందులో 96 శాతం అంటే 12,08,293 కుటుంబాలకు అర్హత ఉంది. వీరందరికీ ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇవ్వాలంటే రూ.105,06,10,763.50 ఖర్చవుతుంది.



ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.2,608

సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా ప్రతి ఇంటికి ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అనంతపురంలో తాజాగా ఒక్కో సిలిండరు ధర రూ.869.50 ఉంది. మూడు సిలిండర్ల లెక్కన ప్రస్తుతమున్న వంట గ్యాస్ ధర ప్రకారం ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.2,608.50 ప్రయోజనం కలుగుతుంది.

దీపం పథకం కింద..

మహిళలకు కట్టెల పొయ్యి నుంచి విముక్తి కలిగించేందుకు 1999లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నప్పుడే దీపం పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 4,09,764 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సిలిండర్‌కు రూ.869.50 చొప్పున ఏడాదికి రూ.35,62,89,798 భరించాల్సి ఉంటుంది. వీటితో పాటు సామాజిక బాధ్యత కింద ఇంధన కంపెనీలకు సంబంధించి 68,451 కనెక్షన్లు ఉన్నాయి. ఏడాదికి మూడింటికి రూ.5,95,18,144.50 వెచ్చించాల్సి ఉంది.

ప్రధానమంత్రి ఉజ్వల పథకం

ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 28,478 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై రూ.300 చొప్పున ఏడాదికి 12 సిలిండర్లకు రాయితీ ఇస్తోంది. అంటే వీరికి ఒక్కో సిలెండర్‌పై రూ.569.50 చొప్పున రాయితీ ఇవ్వాలి. మూడింటికి ఏడాదికి రూ.2,47,61,621 అవుతుంది.

ఈకేవైసీ వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్ల పంపిణీ ప్రకటించింది. ఆయా ఏజెన్సీల కింద ఉన్న వినియోగదారులకు డీలర్లు సమాచారం చేరవేశారు. గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఆధార్ కార్డు తీసుకెళ్లి వేలిముద్ర వేయించుకుంటున్నారు. గ్యాస్ వినియోగదారులంతా ఈకేవైసీ చేసుకుంటే జిల్లాలో అసలైన గ్యాస్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయన్నది తెలుస్తుందని ప్రముఖ గ్యాస్ డీలరే చెప్పడం గమనార్హం.


చిత్రీకరణలో ఖదీర్‌అహ్మద్

లఘు చిత్రాలు తీసి.. వీక్షకులను మెప్పించి!

- సామాజిక అంశాలపై చిత్రీకరణ
- గుంతకల్లు కుర్రాడి ప్రత్యేకత

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లుకు చెందిన ఎస్. ఖదీర్ అహ్మద్ వెండితెర మీద ఆసక్తి పెంచుకున్నారు. దేశభక్తి, కుటుంబం, సామాజిక అంశాలపై లఘు చిత్రాలు తీసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ‘ఏ స్మాల్ డాట్ ఫిలిమ్స్’ అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు. 2009లో డిగ్రీ పూర్తి చేసి హైదరాబాదుకు వెళ్లారు. చిత్రపరిశ్రమలో అడుగుపెట్టి జూనియర్ ఆర్టిస్టుగా, సహాయ దర్శకుడిగా, స్టిల్ ఫొటో గ్రాఫర్‌గా, కెమెరామెన్‌గా పని చేశారు. వేదం, సింహా చిత్రాలకు సహాయ దర్శకుడిగా పని చేశారు. 2012లో హైదరాబాదు నుంచి గుంతకల్లుకు వచ్చిన తరువాత డైరెక్టర్‌గా కొన్ని లఘు చిత్రాలు తీశారు.


● జ్ఞానోదయం, నాన్నకు అంకితం, దేశభక్తి, త్రివర్ణ పతాకం, మన దేశ పతాకం తదితర లఘు చిత్రాలు తీసి వీక్షకులను మెప్పించారు. ప్రస్తుతం బంధం షార్ట్ ఫిలిమ్స్ తీస్తున్నారు. దాదాపు 25 దాక లఘు చిత్రాలు తీశారు.

తక్కువ బడ్జెట్‌తో చిత్రం

తక్కువ బడ్జెట్‌లో అసాంఘిక కార్యక్రమాలను అరికట్టే అంశంపై మండమందితో కలిసి గుంతకల్లు కేంద్రంగా ‘చోర్‌నోట్’ చిత్రాన్ని తీశారు. గుంతకల్లు వాసవీ థియేటర్‌లో 20 రోజుల పాటు రోజుకు 4 ఆటలు ఆడించారు.


చోర్ నోట్ చిత్రాన్ని విడుదల చేస్తున్న ఖదీర్ అహమ్మద్, చిత్ర బృందం (పాతచిత్రం)

ఉన్నతంగా చదివి.. ఉత్తమ ర్యాంకులు సాధించి



ఐసీఏఆర్‌లో ఎన్‌జీ రంగా వ్యవసాయ ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ



మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మడకశిర ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు పీజీలో ప్రవేశం కోసం జూన్ నెలలో జరిగిన(ఐసీఏఆర్, ఏఆర్‌ఎస్) జాతీయ స్థాయి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలలో 10 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో 100లోపు ర్యాంకులు సాధించి ప్రతిభను చాటారు. కళాశాల ఆచార్యుల ప్రోత్సాహం, మంచి ఉత్తీర్ణత అవసరమైన సలహాలు, సూచనలు ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు సాధ్యమైందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించి అధిక లాభాలు సాధించేలా చూస్తా..



మా స్వగ్రామం సంకిరెడ్డిపల్లి, మడకశిర మండలం. తల్లిదండ్రులు తిమ్మారెడ్డి, గీత. వ్యవసాయం పనులు చేస్తున్నారు. ఐసీఏఆర్ ప్రవేశపరీక్షలో 331 ర్యాంకు వచ్చింది. నీటి యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధికలాభాలు వచ్చేలా ఆధునాతన యంత్ర ఆవిష్కరణలు చేసి రైతులకు అందించి అభివృద్ధికి కృషి చేస్తా. రెండేళ్ల క్రితం చింత ప్రాసెసింగ్ యంత్రాన్ని తయారుచేసి రైతులకు అవగాహన కల్పించాం. త్వరలో రైతులకు అందుబాటులోకి తెస్తాం. **- ఇందు**

అన్నదాతలకు అండగా నిలుస్తా



మా స్వగ్రామం గుంతకల్లు. తల్లిదండ్రులు ఈరన్న, లలిత. డెయిరీ నిర్వహిస్తున్నారు. ఐసీఏఆర్‌లో 83వ ర్యాంక్ వచ్చింది. ఉమ్మడి జిల్లాలో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఎంటెక్ అనంతరం వ్యవసాయంలో రైతులకు ఉపయోగపడే కొత్త విత్తన వంగడాలు, తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు సాధించేలా కృషి చేస్తా. **- లోకిత**

లాభసాటిగా మార్చేందుకు కృషి



మా స్వగ్రామం కర్నూలు. తల్లిదండ్రులు బాలమల్లయ్య, నాగమణి. ఐసీఏఆర్ ప్రవేశపరీక్షలో జాతీయస్థాయిలో 573వ ర్యాంకు సాధించాను. ఎంతో సంతోషంగా ఉంది. ప్రొఫెసర్ల మంచి విద్యాబోధన, ఎంటెక్‌లో ర్యాంకు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తగా ఎదిగి వ్యవసాయ రంగానికి సేవలందిస్తా. **- మంజునాథ్**

శాస్త్రవేత్తగా రాణిస్తా..



మా స్వగ్రామం నెల్లూరు. అమ్మానాన్న వెంకటరమణయ్య, ఆదిలక్ష్మి. మాది వ్యవసాయ కుటుంబం. ఐసీఏఆర్ ప్రవేశ పరీక్షల్లో జాతీయ స్థాయి 54వ ర్యాంకు వచ్చింది. ఎంతో సంతోషంగా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో రైతుల పంట పొలాలను సందర్శించి వారి కష్టాలను చూశా. పంటలకు చీడపీడలు సోకి తీవ్రంగా నష్టపోతున్నారు. ఎంటెక్ అనంతరం శాస్త్రవేత్తగా పంటలకు సోకే తెగుళ్ల నివారణకు మంచి మందులు కనుగొని మంచి దిగుబడులు సాధించేలా కృషి చేస్తా. **- సునీల్**

నాణ్యమైన బోధనతో ఉత్తమ ర్యాంకులు

కళాశాల ప్రొఫెసర్లు నాణ్యమైన బోధన అందించడం, విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వ్యవసాయ విద్యలో మంచి మెళకువలు నేర్పించారు. దీనికి తోడు అంతర్ రాష్ట్ర ప్రముఖ వ్యవసాయ ఇంజినీరింగ్ శిక్షణ కేంద్రాల్లో నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారు.

- సరోజినిదేవి, డీన్, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల

యోగా పోటీల్లో మహిళా పోలీసుకు కాంస్యం


కాంస్య పతక విజేత దీపను అభినందిస్తున్న ఎస్పీ జగదీశ్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి యోగా విభాగంలో కాంస్య పతకం సాధించిన జిల్లా మహిళా కానిస్టేబుల్‌ను జి.దీపను ఎస్పీ జగదీశ్ బుధవారం తన ఛాంబర్‌లో అభినందించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భిలాయి పట్టణం అగ్రసేన్ భవన్‌లో సెప్టెంబరు 23 నుంచి 27 వరకు ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్‌లో ‘యోగా’ విభాగంలో పోటీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖకు మొత్తం 19 పథకాలు వచ్చాయి. అందులో ‘ఆర్టిస్టిక్ యోగా’ మహిళల విభాగంలో అనంతపురం మహిళా పోలీస్‌స్టేషన్‌కు చెందిన దీప మూడో స్థానంలో నిలిచి కాంస్య పథకం సాధించారు. పతకాన్ని ధరింపజేసి ఎస్పీ సత్కరించారు. గుంతకల్లు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్.పులిబాబు ఆర్టిస్టిక్ గ్రూపు పురుషుల విభాగంలో ఐదో స్థానంలో నిలిచారు. సంప్రదాయ యోగాసన పురుషుల విభాగంలో అనంతపురం డీటీసీకి చెందిన ఎం.చలపతి 15 స్థానంలో నిలిచారు. వీరిని ఎస్పీ అభినందించారు.

ఆర్డీటీ గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్రీడలు: ఆర్డీటీ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర స్థాయి బాలికల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆర్డీటీ పనిచేస్తున్న 38 ప్రాంతాల నుంచి 400 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆర్డీటీ డైరెక్టర్లు లైలా జులేఖా, మహమ్మద్ రఫీలు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. తొలుత బాలికలు చేసిన టార్చ్‌రన్, మార్చ్‌ఫాస్ట్‌లు ఆకట్టుకున్నాయి. బాలురతో సమానంగా బాలికలను కూడా ఆటల్లో ప్రోత్సహించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఈ పోటీలు 12 పర్యాయాలు నిర్వహించి ప్రతిభావంతులను వెలుగులోకి తెచ్చామని వివరించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ అంశాలు ఉంటాయని వివరించారు.



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న బాలికలు

కాస్త ఓపిక పట్టు.. నీ గుట్టు విప్పుతా: మంత్రి

ధర్మవరం, న్యూస్‌టుడే:: ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దీటుగా స్పందించారు. ఎక్స్ వేదికగానే మంత్రి సమాధానం ఇస్తూ.. ‘పచ్చకామెర్లు ఉన్నవారికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది అనే సామెత నీకు సరిగ్గా వర్తిస్తుంది కేటురెడ్డి. . కబ్జా, కమీషన్, కలెక్షన్, కరప్షన్‌లకు కేరాఫ్ అడ్రస్ నువ్వు. కమీషన్లు లేక మైండ్ బ్లాక్ అయినట్లుంది. కాస్త ఓపిక పట్టు. నువ్వు, నీ రౌడీమూకలు చేసిన దారుణాలు, దౌర్జన్యాలు, నేరాలు, ఘోరాల గుట్టు విప్పుతా. తబ్ తక్ నీ నాయకుడి లాగా నువ్వు నీ బెంగళూరు ఫాంహౌస్ మే విశ్రాంత్ కరో’ అంటూ మంత్రి ఎక్స్‌లో మండిపడ్డారు.

సత్య.. నీ వాటాలు అందాయా? కేతిరెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌పై వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. బుధవారం ఎక్స్ వేదికలో. . ‘సత్య ధర్మవరం నియోజకవర్గ ప్రజలు నిన్ను నమ్మి ఓటు వేసి గెలిపించిన పాపానికి నువ్వు, నీ కూటమి పార్టీ నేతలైన జనసేన, తెదేపా నాయకులు దౌర్జన్యాలకు దిగుతున్నారు’ అని పోస్టు చేశారు. వాటాలు వేసుకుంటూ నియోజకవర్గ ప్రజల్ని భయపెట్టి ఇప్పటికే ఎంతో మంది దగ్గర వసూళ్లు చేశారు. సత్య నీ వాటాలు నీకు అందాయి కదా? అని ప్రశ్నించారు.

సెపక్‌తక్రా పోటీల్లో బాలికల జట్టు జయకేతనం


అనంతపురం బాలికల జట్టుకు కప్ అందిస్తున్న డీవీఈవో పద్మ

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో రెండ్రోజులపాటు జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలబాలికల సెపక్‌తక్రా ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో నువ్వానేనా అన్నట్లు పోటీ సాగింది. తుది పోరులో ప్రకాశం జిల్లా జట్టుపై కర్నూలు జిల్లా జట్టు గెలిచి విజేతగా నిలిచింది. ప్రకాశం జట్టు రెండు, పశ్చిమ గోదావరి జట్టు మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో తుది పోటీలో కృష్ణా జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు గెలిచింది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు తెదేపా నాయకులు, అధికారులు కప్‌లు, జ్ఞాపికలు అందించారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ యెలినేడి రామస్వామి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వెంకటఅప్పారావు, సర్పంచి అన్నపూర్ణమ్మ, తెలుగురైతు నాయకులు శ్రీనివాసరావు, సాంబయ్య, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి జి.కె.జుబేర్, డీవీఈవో జె.పద్మ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం బుల్లెమ్మ పెళ్లి పేరిట మోసం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలానికి చెందిన ఓ యువకుడికి దాదాపు 40 ఏళ్లు వచ్చినా వివాహం కాలేదు. ఇంట్లో తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు చూసిన అతడు వారిని సంతోష పెట్టాలని ఇక్కడి బ్రోకర్‌ను తీసుకొని భీమవరం ప్రాంతానికి వెళ్లి అక్కడున్న బ్రోకర్లను ఆశ్రయించాడు. వారు రూ.4 లక్షలు దండుకొని నీలపు బాల అనే మహిళతో వివాహం జరిపించారు. ఆమెను హిందూపురం తీసుకొచ్చినా అతడితో కాపురం చేయకుండా వాయిదా వేస్తూ వచ్చింది. వారం రోజుల తర్వాత తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేదని వెంటనే వెళ్లాలని చెప్పింది. దీనికి అతను నిరాకరించడంతో ఆత్మహత్య చేసుకొంటానని బెదిరించింది. చేసేదిలేక ఆమెను తీసుకొని భీమవరానికి రైలులో వెళ్లాడు. రైల్వేస్టేషన్‌లో దిగిన వెంటనే ఆమె మన వివాహం మా తల్లిదండ్రులకు తెలియదని, వారికి తెలిస్తే చాలా ఇబ్బందని, ఇక్కడే ఉండు వస్తానని చెప్పి వెళ్లింది. అంతే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి మూడు, నాలుగు రోజులు గడిచినా రాకపోవటంతో వెనుదిరిగిన అతను చేసేదిలేక బుధవారం బ్రోకర్లు, నీలపు బాలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు


గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్- 1938 సంఘం రాష్ట్ర మహాసభలు ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరుగుతాయని ఆ సంఘం నేత కులశేఖర్‌రెడ్డి తెలిపారు. మహాసభలకు సంబంధించిన గోడపత్రాలు బుధవారం విడుదల చేశారు. విజయనగరంలో ఈ మహాసభలు జరుగుతాయన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్, వెంకటసుబ్బయ్య, మహమ్మద్ రఫీక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి


మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ.. పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ సదుపాయం కల్పించాలన్నారు. భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఉన్నతీకరించి పదోన్నతులు కల్పించాలన్నారు. అర్బన్ ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన అసంబద్ధ విధానాలు ఉన్నాయన్నారు. జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, నాగేంద్ర, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, శివశంకర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సచివాలయ ఉద్యోగి?

విడపనకల్లు(ఉరవకొండ): పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా విడపనకల్లు గ్రామ సచివాలయ ఉద్యోగి ఇనాయతుల్లా అదృశ్యమైన విషయం తెలిసిందే. ఆ ఉద్యోగిని బుధవారం విడపనకల్లు పోలీసులు అనంతపురంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతణ్ని ఉరవకొండకు తీసుకువచ్చి విచారించగా, లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేయడానికి వెళ్తుండగా రూ.2.52 లక్షలు ఎక్కడో పడిపోయాయని చెప్పినట్లు సమాచారం. రెండు రోజులు సమయం ఇస్తే, నగదును చెల్లిస్తానని ఒప్పుకొన్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

యువకుడి అనుమానాస్పద మృతి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తప్పెటవారిపల్లి గ్రామంలో సత్యనారాయణ (21) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సత్యనారాయణ కొన్నేళ్లుగా కియా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నప్పుడే తండ్రి చిన్న నారాయణ చనిపోయారు. అనంతపురంలో అద్దెగదిలో ఉంటూ అక్కడి నుంచి కియా కంపెనీకి వెళ్లి వచ్చేవాడు. ఇటీవల తల్లి సరోజమ్మ అనారోగ్యానికి గురికావడంతో చూసేందుకు ఆదివారం ఇంటికొచ్చాడు. సోమవారం తిరిగి విధులకు వెళ్తున్నానని చెప్పినా మంగళవారం గ్రామంలో కనిపించినట్లు స్థానికులు తెలిపారు. బుధవారం సత్యనారాయణ తోటలో మృతిచెంది కనిపించడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. మృతికి కారణాలు తెలియరాలేదు. ముదిగుబ్బ గ్రామీణ సీఐ శ్యామరావు, పట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం నల్లగా మారడంతో విద్యుదాఘాతంతో చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వసతి గృహాల తనిఖీ


విద్యార్థుల హాజరు పరిశీలిస్తున్న న్యాయమూర్తి జయలక్ష్మి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: మండల న్యాయ సేవ సాధికార సంస్థ ఛైర్మన్, కదిరి సీనియర్ సివిల్‌జడ్జి జయలక్ష్మి బుధవారం కదిరిలో ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజనశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టిక, ఆహార పదార్థాల నాణ్యతపైనా ఆరాతీశారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్నిసదుపాయాల అందేలా చూడాలని ప్రిన్సిపల్, వార్డెన్లకు సూచించారు. అప్రమత్తంగా ఉంటూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డెన్లు దుర్గాప్రసాద్, సాంబశివుడు పాల్గొన్నారు.

టమాటా కిలో రూ.74

అనంతపురం (వ్యవసాయం): కక్కలపల్లి మార్కెట్‌లో టమాటా ధరలు భారీగా పెరిగాయి. బుధవారం మార్కెట్‌కు 675 టన్నులు టమాటా వచ్చింది. ధరలు పరిశీలిస్తే గరిష్ఠంగా మొదటి రకం కిలో రూ.74, రెండో రకం రూ.65, మూడో రకం రూ.50 చొప్పున ధరలు పలికాయి. 15 కిలోల బుట్ట ధర మొదటి రకం రూ.1,110, రెండో రకం రూ.975, మూడో రకం రూ.750 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.


విశాఖ ఉక్కుపై కూటమి వైఖరి తెలపాలి

కార్మిక సంఘాల డిమాండ్


మాట్లాడుతున్న సమన్వయ కమిటీ కన్వీనర్ రాజారెడ్డి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అంశంపై ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కార్మిక సంఘాలు డిమాండు చేశాయి. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల అధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. విశాఖ ఉక్కు పోరాట సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ రాజారెడ్డి మాట్లాడుతూ.. ఆనాడు 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను భాజపా ప్రభుత్వం అడ్డదారిలో ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. భాజపా దేశంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి ఉక్కు పరిశ్రమను నష్టాల్లోకి నెట్టిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఉక్కు పరిశ్రమను దారాదత్తం చేస్తూ వేలాది మంది కార్మికుల పొట్టను కొడుతుందన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించి, పరిశ్రమను కాపాడాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ‘స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్’లో విలీనం చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందని చెబుతూ, మరోవైపు 4,290 మంది కార్మికులను తొలగించడానికి ప్రయత్నం చేయడం దారుణమన్నారు. మరోవైపు 2,500 కార్మికులను వీఆర్‌ఎస్ ఇస్తామంటూ ప్రచారం జరుగుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కును కాపాడుకుంటామని చెప్పిన తెదేపా, జనసేనలు ప్రైవేటీకరణ కాకుండా చూడాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌బాబు, బీసీ విద్యార్థి, యువజన సంఘాల అధ్యక్షులు కేశవ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రామాంజి పాల్గొన్నారు.

గొర్రెల కాపరి మృతి


రామాంజనేయులు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు (51) అనే గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు బలమైన గాయమై మృతి చెందారు. ఈఘటన బుధవారం రాత్రి జరిగింది. రామాంజనేయులు గ్రామ సమీపంలో గొర్రెల మంద వద్దకు రాత్రి నిద్రించడానికి వెళ్లాడు. రాత్రి వేళ నిద్రలో లేచి నీరు తాగడానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు వెనుక భాగంలో రాయి తగలడంతో అక్కడే ఉన్న తోటి కాపరులు గుర్తించి చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య భూలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

హెచ్చెల్సీలో గుర్తు తెలియని మృతదేహం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీ పరిధిలోని హెచ్చెల్సీ కాలవలో బుధవారం గుర్తుతెలియని పురుషుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 40 ఏళ్లు ఉన్న వ్యక్తి మృతదేహం అనంతపురం వైపు నుంచి మండల పరిధిలోని శర్మ కాలనీకి కొట్టుకువచ్చిందన్నారు. మృతదేహంపై నలుపు, తెలుపు రంగు అంగీ, నీలం రంగు జీన్స్ ప్యాంటు ఉందన్నారు. జేబులో రెండు చరవాణులు లభించాయన్నారు. ఇతని సమాచారం తెలిసినవాళ్లు బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని రెడ్డిపల్లి అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న రాముడు(50) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన రాముడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామంలోనే కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. కుటుంబ పోషణకు గ్రామంలో వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకున్నాడు. అధిక వడ్డీల కారణంగా ఇచ్చిన డబ్బులు చెల్లించలేక పోయారు. వ్యాపారులు రాముడు ఇంటిని కూడా అప్పులకు జమ చేసుకున్నట్లు తెలిసింది. అయినా వ్యాపారులు డబ్బులివ్వాలని ఒత్తిడి చేస్తుండటంతో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ ఐకాసా అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ రాముడు కుటుంబాన్ని వేధించిన వడ్డీ వ్యాపారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. రాముడి ఇంటిని ఆ కుటుంబానికి చెందేలా అధికారులు నిర్ణయం తీసుకోవాలన్నారు.

పుట్టెడు శోకం.. బతుకు భారం

● మంచానికే పరిమితమైన భర్త ● ముగ్గురు ఆడపిల్లలను పోషించలేక సతమతం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: చిన్న కుటుంబం. సాఫీగా సాగిపోతున్న జీవితం. అనుకోని రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని కష్టాల్లోకి నెట్టింది. ఇంటి పెద్దను మంచానికే పరిమితం చేసింది. ఒక్కసారిగా ఆనందాలు దూరమయ్యాయి. తండ్రి నిస్సహాయ స్థితిలో పడి ఉండటాన్ని చూస్తూ పసి మనస్సులు తల్లడిల్లిపోతున్నాయి. ముగ్గురు ఆడ పిల్లలను పోషించలేక ఆ తల్లి గుండె శోకంతో బరువెక్కింది. రోజులు గడిచే కొద్దీ పూట గడవటం భారమైంది. కష్టకాలంలో ఆపన్న హస్తం అందించాలని ఆ చేతులు అర్థిస్తున్నాయి. కళ్యాణదుర్గం పట్టణంలోని రామస్వామి కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, విశాలమ్మకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె చైత్రసాయి ఏడో తరగతి, రెండో కుమార్తె ఫణిశ్రీ ఐదో తరగతి, భవ్యశ్రీ మూడో తరగతి చదువుతున్నారు. శ్రీనివాసులు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవారు. రూ.15లక్షలు అప్పు చేసి ఇల్లు కట్టుకున్నారు. ఉన్నంతలో భార్య, పిల్లలను పోషించుకునేవారు. గతేడాది నవంబర్ 14న గుండ్లపల్లి నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలకు గాయమైంది. వైద్యులు పరీక్షించి మెదడులో రక్తం గడ్డ కట్టిందని చెప్పారు. శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత అనంతపురం, బెంగళూరులోని ఆసుపత్రుల్లో వైద్యం అందించారు. అయినా నయం కాలేదు. వైద్యం కోసం విశాలమ్మ రూ.15లక్షల వరకు అప్పు చేశారు. అప్పులిచ్చిన వారు తిరిగి కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. ఎటువంటి ఆసరా లేదు. భర్తకు పాలు తీసుకురావడానికి కూడా డబ్బులు లేవని కంటతడి పెట్టారు పిల్లల చదువులు, భవిష్యత్తును తలచుకొని రోధిస్తున్నారు. వీరి దీనగాథను చూసి చలించిన బ్యాంకు ఉద్యోగి లోకేశ్, అధ్యాపకుడు బాపూజీ, ఎంఈవో శ్రీధర్, ఉపాధ్యాయులు అశోక్, మంజునాథ్ తదితరులు రూ.8వేల విలువైన సరకులు, రూ.12వేల నగదు అందజేశారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆపన్న హస్తం అందించి ఆదుకోవాలని విశాలమ్మ వేడుకొంటున్నారు.


కుమార్తెలతో విశాలమ్మ


నిస్సహాయ స్థితిలో శ్రీనివాసులు

హిందూపురం

● హిందూపురం ● పెనుకొండ ● మడకశిర



సాయం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, ఉపాధ్యాయులు

పేద విద్యార్థులకు చేయూత

మడకశిర, న్యూస్‌టుడే : ఆర్థిక స్థోమత లేక ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులకు బుళ్లసముద్రం ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, దాతలు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం స్థానిక వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో శాలిని, భవిత, సాయి స్వర్ణలత, నయనశ్రీలకు రూ.37వేల ఆర్థికసాయం అందజేశారు. ఉపాధ్యాయులు చంద్రమోహన్, చెన్నకేశవులు, హరిప్రసాద్, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ఆర్థిక సాయం

అగళి, న్యూస్‌టుడే: అగళికి చెందిన నళిని ఉన్నత చదువు కోసం మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. నళిని డిగ్రీ పూర్తి చేసింది. బుక్కరాయసముద్రం మండలం సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ సీటు రావడంతో ఆర్థిక స్థోమత లేక ఎమ్మెల్యేకి సమాచారం ఇచ్చింది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అనంతపురం ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఆర్థిక సాయం అందజేశారు. తండ్రి ఓబయ్య మృతి చెందడంతో తల్లి దేవమ్మ పిల్లలను చదివిస్తోంది. దీంతో ఎమ్మెల్యేకు విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

బాధ్యతలు స్వీకరించిన డా.లింగన్న

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బుధవారం లింగన్న బాధ్యతలు స్వీకరించి నివేదికను డీసీహెచ్‌ఎస్‌కు పంపారు. అయితే ఇప్పటివరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన రోహిల్‌కుమార్ ఇంకా బాధ్యతలు అప్పగించలేదు. ఆయన రెండు రోజులు సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. ఈనెల 5వ తేదీన ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆలోపు అతను బాధ్యతలు అప్పగిస్తారా లేదా అన్నది సందిగ్ధంగా మారింది.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

లేపాక్షి: లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తెలిపారు.

హిందూపురం అర్బన్ : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యుల కులదైవమైన వాసవిమాతకు గురువారం నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

చిలమత్తూరు, న్యూస్‌టుడే: అనంతపురానికి చెందిన మార్క్ ఆసుపత్రి డాక్టర్లు చిలమత్తూరు మండల ప్రజలకు గుండెకు సంబంధించిన చికిత్సలు చేశారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు బుధవారం తెలుగుయూత్ పార్లమెంట్ కార్యదర్శి నాగేంద్ర, మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో 300 మంది రోగులకు చికిత్స చేశారు. నలుగురికి వెంటనే ఆపరేషన్ అవసరమని డాక్టర్లు మహష్, నాగరాజు, వినోద్‌లు సూచించారు. మండల తెదేపా నాయకులు లక్ష్మీనరసింహప్ప, అశ్వర్థప్ప, నందీశప్ప, నరేంద్ర, రఫిక్, చాంద్‌బాషా, ఎన్‌బికే మూర్తి, నాగరాజు, ఎంఈవో-1 పద్మప్రియ పాల్గొన్నారు.

అనారోగ్యంతో రొద్దం ఎంపీపీ మృతి

రొద్దం: రొద్దం మండల ఎంపీపీ చంద్రశేఖర్(60) అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. వైకాపా నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

బంగారం, నగదు చోరీ

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని పిల్లిగుండ్ల యల్లమ్మగుడి కాలనీలోని ఈశ్వరప్ప ఇంటిలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. దాదాపు 20 తులాలు బంగారు నగలు, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు పొలంలోని పంటను తొలగించినందున కాపలాగా ఇంటికి తాళాలు వేసి పొలం వద్దకు వెళ్లడంతో ఈ చోరీ జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుళ్లు రామలింగయ్య, రమణ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

గోరంట్ల: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా బుధవారం రాత్రి ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వీరిలో ఒకరికి కాలు విరిగినట్లు వైద్యాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. హిందూపురం ధనలక్ష్మీరోడ్డుకు చెందిన నగేష్ గోరంట్ల మండలంలోని కమ్మలవాండ్లపల్లికి వెళుతున్నాడు. మరో వాహనంలో ఓబుళదేవరచెరువు మండలం గొల్లపల్లికి చెందిన శివ గోరంట్ల వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

నాసిన్‌లో సామగ్రి అపహరణ
వ్యక్తి అరెస్టు, వాహనం జప్తు

గోరంట్ల: గోరంట్ల మండలంలోని పాలసముద్రం సమీపంలోని నాసిన్ నుంచి సామగ్రి అపహరించుకుని వెళుతుండగా నిర్మాణ బాధ్యతలు చూస్తున్న ప్రైవేటు కంపెనీ అధికారి పవన్‌కుమార్‌రెడ్డి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెంట్రింగ్‌కు వినియోగించే రూ.5.20లక్షల విలువచేసే ఇనుప పైపులు, అల్యూమినియం సామగ్రి, బొలెరో వాహనం జప్తు చేసినట్లు సీఐ శేఖర్ పేర్కొన్నారు. హిందూపురానికి చెందిన శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు వివరించారు.

స్నేహితుడిపై కత్తితో దాడి

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: ఇద్దరు స్నేహితులు.. చెడు తిరుగుళ్లు తిరిగేవారు. తరచూ కలిసి మద్యం తాగేవారు. వారిద్దరి మధ్య రూ.5 వేల అప్పు విభేదాలను తెచ్చింది. స్నేహితుడిని కత్తితో ఎక్కడ పడితే అక్కడ కోయడంతో తీవ్ర గాయాలైన ఘటన హిందూపురం గ్రామీణ మండలం సంతేబిదనూరులో చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన ఇమ్రాన్, గోపాల్‌లు స్నేహితులు. తన అవసర నిమిత్తం గోపాల్ నుంచి రూ.5 వేలు తీసుకొన్న ఇమ్రాన్ ఆ సొమ్మును చెల్లించడానికి నిరాకరించాడు. ఇచ్చేది లేదని, నీ చేతనైన పని చేసుకో అని కొంతకాలంగా మొండికేశాడు. దీంతో స్నేహితుడుపై కోపంతో ఉన్న గోపాల్ బుధవారం బ్లేడు ఉన్న కత్తిని తీసుకొని, ఇమ్రాన్ మెడతో పాటు శరీరంలో పలు చోట్ల కోశాడు. తీవ్ర గాయాలైన ఇమ్రాన్‌ను హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. గ్రామీణ మండల పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమల కాలుష్యం.. ప్రజలకు హానికరం



గొల్లాపురం సమీపంలో పరిశ్రమల నుంచి వస్తున్న పొగ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తూముకుంట, గొల్లాపురం పారిశ్రామికవాడలో కొన్ని పరిశ్రమల ద్వారా వచ్చే పొగ ప్రభావంతో కాలుష్యం ఏర్పడి సమీప గ్రామాల్లోని ప్రజల అనారోగ్య పాలవుతున్నారు. నియంత్రణ చేయాలని పలుమార్లు పరిశ్రమల అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ 80కి పైగా వివిధ పరిశ్రమలుంటే స్టీలు, ఇనుము తయారుచేసే పరిశ్రమలు పది ఉన్నాయి. వీటి ద్వారానే పొగ ఎక్కువగా వస్తోంది. పొగ గొట్టాలను చాలా తక్కువ ఎత్తులోనే ఏర్పాటుచేయడంతో కాలుష్యం ఉద్ధృతం కావడానికి కారణమవుతోంది. పరిశ్రమలు నెలకొల్పే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించి చట్టపరంగా స్థానికులకు ఉద్యోగావకాశాలు ఇస్తాం, ఆవరణాల్లో చెట్లు పెంచుతాం, చట్టపరంగా అన్ని నిబంధనలు పాటిస్తామని హామీలు ఇచ్చి తీరా పరిశ్రమలు ఏర్పాటుచేసిన తర్వాత వాటిని అటు పారిశ్రామికవేత్తలు, ఇటు అధికారులు ఉల్లంఘిస్తున్నారని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు.

ఉదయం 9 గంటల నుంచే..

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏకధాటిగా పొగ వస్తుండటంతో సాగుచేసిన మల్బరీ, వేరుసెనగ, మొక్కజొన్న, మిరప పంట ఆకులపై నల్లగా ఏర్పడి పంట దిగుబడి ఆశించినంతగా రావడం లేదని రైతులు అంటున్నారు. ఇంట్లో వంట చేసే పాత్రలు, తాగు నీటి బిందెలపై చేరి నల్లని రంగులో ఉంటున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గాలిని పీల్చడం ద్వారా రోగాలబారిన పడుతున్నామని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గుడ్డంపల్లి సమీపంలో..

మండలం: హిందూపురం గ్రామీణం
పొగ ప్రభావితం చేసే పరిశ్రమలు : 10
కాలుష్యానికి గురయ్యే గ్రామాలు : గొల్లాపురం, తూముకుంట, దేవరపల్లి, గుడ్డంపల్లి
జనాభా: 4916

రోగగ్రస్థులకు ముప్పు

కాలుష్యమైన పొగ పీల్చడం ద్వారా ఇప్పటికే రోగాలతో బాధపడేవారి ప్రాణాలకు ముప్పు కలుగుతుంది. ప్రధానంగా మధుమేహం, అధిక రక్తపోటు, ఆస్మా, ఊపరితిత్తుల వ్యాధిగ్రస్తులకు అత్యంత ప్రాణాహాని కలిగిస్తుంది. నీరసం, దగ్గు, శ్వాస తీసుకోవడం ఇబ్బంది కలిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
– జయంత్‌నాయక్, కె.బసవనపల్లి వైద్యాధికారి

నియంత్రణ చర్యలు తీసుకుంటాం

పారిశ్రామికవాడను సందర్శించి పొగ వచ్చే పరిశ్రమలను పరిశీలించి నిబంధన మేరకు గొట్టాలను ఏర్పాటు చేశారా, లేదా అనే వాటిని సేకరిస్తాం. పారిశ్రామిక వేత్తలను సంప్రదించి నిబంధన మేరకు పొగ సజావుగా వెళ్లే విధంగా చూడాలని సూచించి నియంత్రణ చర్యలు తీసుకుంటాం. – కిశోర్‌కుమార్‌రెడ్డి, కాలుష్యనియంత్రణ విభాగాధికారి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: శిరివరంలో ట్యాంకు నిండి నీరు వృధా అవుతోంది. **-జయరామప్ప**
సమాధానం: సిబ్బందిని పంపి కట్టడి చేస్తాం. -నేత్రావతి, సర్పంచి
సమస్య: గోపిందేవరపల్లిలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. -నాగమణి
సమాధానం: సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. **-రామాంజినేయులు, కార్యదర్శి, శిరివరం.** –న్యూస్‌టుడే, లేపాక్షి

సమస్య : మిషన్‌తండాలో ఇళ్లవద్దే మురుగు. **-జయరాంనాయక్**
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకంటాం.
-గంగప్ప, సర్పంచి, పాలసముద్రం –న్యూస్‌టుడే, గోరంట్ల

సమస్యల పరిష్కారం

స్పందనకు వందనం

లేపాక్షి: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు 'ఈనాడు'లో ప్రచురితమయ్యే 'మేమున్నాం...మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో సంబంధిత బాధ్యులు స్పందించి పరిష్కరించారు. కొండూరు బీసీ కాలనీలో మురుగు రహదారిపైకి రాకుండా సర్పంచి సిద్ధార్థ ప్రత్యేక చొరత తీసుకుని పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రతా చర్యలు చేపట్టారు. ఓబుళాపురంలో పంచాయతీ కుళాయిల నుంచి నీరు వృథాగా వెళ్లకుండా సర్పంచి నరేంద్రకుమార్ బిరడాలను అమర్చారు.

తీగ సరిచేశారు..

ఈనాడు కథనానికి స్పందన

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కె.బ్యాడిగెర గ్రామంలోని చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగ ఉండటంతో సోమవారం 'ఈనాడు'లో మృత్యుపాశంగా విద్యుత్తు తీగ చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తుశాఖ అధికారులు నియంత్రిక వద్ద తీగను ఎత్తుకు పెంచి ప్రమాదం తప్పించారు.

అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలపై చర్యలు

హిందూపురం: అర్హత లేకుండా, అనధికార రక్త పరీక్ష ల్యాబులు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకొంటామని పట్టణ ఆరోగ్య కేంద్రాల నోడల్ ఆఫీసర్ డా.పద్మజ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు రక్తపరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. నిబంధనలు పాటించని కేంద్రాల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు అందించినట్లు ఆమె తెలిపారు. బృందం సభ్యులు ముస్తఫా, రమేశ్ పాల్గొన్నారు.

లాల్‌బహదూర్‌శాస్త్రికి నివాళి

హిందూపురం గ్రామీణం : మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకున్నారు. తూముకుంట పారిశ్రామికవాడలో కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్, చౌళూరులో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో కార్మికులు, విద్యార్థి నాయకులు, పెనుకొండ పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో పార్టీశ్రేణులు నివాళులర్పించారు.



హిందూపురంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ నాయకులు



హిందూపురంలో ఆర్యవైశ్య, యువజన సంఘం సభ్యులు



మడకశిరలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి

మహాత్ముడి ఆశయాలు కొనసాగిద్దాం



పారిశుద్ధ్య కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న మంత్రి సవిత

మహాత్మాగాంధీ ఆశయాలతోనే దేశాభివృద్ధి సాధ్యమని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. బుధవారం మూడు నియోజకవర్గాల్లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయులు, దేశ భక్తులు, ఆర్యవైశ్యులు పాల్గొని గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా, శాంతిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.
– న్యూస్‌టుడే బృందం



గోరంట్లలో తెదేపా నాయకులు

విధి నిర్వహణలో విఫలమైతే చర్యలు

హిందూపురం పట్టణం: సచివాలయాల ఇంజినీరింగ్ కార్యదర్శులు వారికి ప్రభుత్వం నిర్దేశించిన జాబ్‌చార్ట్ ప్రకారం పని చేయాలని, విధి నిర్వహణలో విఫలమైతే క్రమశిక్షణ చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆయన బుధవారం ఇంజినీరింగ్ కార్యదర్శులు, నీటి సరఫరా విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, మరింత బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ కార్యదర్శులు తమ వార్డు పరిధిలో నీటి సరఫరా, వీధి దీపాలు, మౌలిక సదుపాయాల కల్పన అంశాలపై పూర్తి బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. వారు పని చేసే సచివాలయంలోనే ఇంజినీరింగ్ కార్యదర్శి వద్ద హాజరు వేయాలని సూచించారు. మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్, నీటి సరఫరా విభాగం డీఈ బాలసుబ్రహ్మణ్యం, ఏఈ జనార్దన్ పాల్గొన్నారు.



నీటి సరఫరా విభాగం సిబ్బందితో సమావేశమైన అధికారులు

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

సోమందేపల్లి: యువత, విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ఎస్సై రమేశ్‌బాబు తెలిపారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మెగా క్రికెట్ పోటీలను తెదేపా హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గం కార్యదర్శి చంద్రశేఖర్, జనసేన మండల కన్వీనర్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకుడు జబీవుల్లా తదితరులతో కలిసి ఎస్సై ప్రారంభించారు. క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. సాయినగర్, చెన్నాపురం క్రికెట్ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు రూ.30 వేలు, జ్ఞాపిక, రన్నర్స్ జట్టుకు రూ.20 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై రమేశ్‌బాబు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

మడకశిర గ్రామీణం, పెనుకొండ: భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం మండలంలోని తులసీదామ వృద్ధాశ్రమంలో కేకు కోసి మిఠాయిలు పంచారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పెనుకొండ పట్టణంలోని ఊరివాకిలి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాజపా జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సభ్యత్వ నమోదు బాధ్యుడు గోపీనాథ్, పలువురు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ వెలకట్టలేనిది



కార్మికులను, కియా ప్రతినిధులను సత్కరిస్తున్న అధికారులు



పరిగిలో సత్కరిస్తున్న భాజపా నాయకులు



కల్లుమర్రిలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, తదితరులు

పెనుకొండ, న్యూస్‌టుడే: సమాజంలో పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తున్న బాధ్యత వెలకట్టలేనిదని కియా ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతిని గుట్టూరులో ఘనంగా నిర్వహించారు. సీఎస్ఆర్(కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటి)లో భాగంగా కియా ఇండియా ప్రతినిధి హయాంగ్‌పార్క్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సామగ్రి అందజేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో శివశంకరప్ప ఆధ్వర్యంలో సచివాలయం ఆవరణలో మొక్కలునాటి నీళ్లు పోశారు. అనంతరం కార్మికులను, కియా ప్రతినిధులను శాలువ, పూలహారంతో సత్కరించారు. ఎన్డీఏ కూటమి నాయకులు సూరి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి, మడకశిర గ్రామీణం: పరిగిలో దివ్య ఎడుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, భాజపా పెనుకొండ నియోజకవర్గం సభ్యత్వ ప్రముఖ్ పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి దుస్తులు పంపిణీ చేశారు. సత్యసాయి జిల్లా భాజపా అధ్యక్షుడు మోహన్‌శేఖర్ పాల్గొన్నారు. మడకశిర మండలం కల్లుమర్రిలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, తదితరులు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

ఘనంగా ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ఏఆర్.రొప్పం గ్రామంలో ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లీశ్వరి, సూపర్‌వైజర్ శంకరమ్మలు హాజరై గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. 1975 అక్టోబరు 2న ఐసీడీఎస్ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కంబదూరులో, అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరులో మొదటి సారిగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

సోమందేపల్లి, న్యూస్‌టుడే: దళితులను సామాజికంగా చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్)ని సీపీఎం 1998 ఏర్పాటు చేసిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమయ్య తెలిపారు. బుధవారం కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ నగర్‌లో మండల అధ్యక్షుడు వెంకటేశులు, నాయకులతో కలసి జెండాను ఆయన ఆవిష్కరించారు. రామాంజనేయులు, రవి, ఆనంద్, నరసింహులు, వెంకటరాముడు పాల్గొన్నారు.

తొలగని చెత్తాచెదారం

హిందూపురం పట్టణంలోని బెంగళూరు రోడ్డులోని రాజధాని పంక్షన్‌హాల్ ముందుభాగాన ఉన్న కాలువలో చెత్తాచెదారం, వ్యర్థాలతో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని రోజులుగా శుభ్రం చేయడం లేదు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
–న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్



స్తంభం ఎక్కిన నిర్లక్ష్యం

రొద్దం మండలంలోని పెనుకొండ-పావగడ ప్రధాన రహదారి పక్కనే ఉన్న బొక్సంపల్లి విద్యుత్ ఉపకేంద్రం గేటు వద్ద అల్లుకుపోయిన తీగలను తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోందని, ప్రమాదం జరగక ముందే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పెనుకొండ ఏఈ నారాయణస్వామిని వివరణ కోరగా సిబ్బందిని పంపించి తొలగిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పెనుకొండ



జింకపై కుక్కల దాడి

పరిగి, న్యూస్‌టుడే: యర్రగుంట సమీపంలోని పొలాల్లో బుధవారం సాయంత్రం జింకను కుక్కలు తరుముతుండగా కాపాడినట్లు గ్రామ యువకుడు జగన్ తెలిపారు. పెనుకొండ అటవీ రేంజ్ అధికారి శివరాం దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి జింకను తెప్పించామన్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం అటవీ ప్రాంతంలో వదులుతామని ఆయన తెలిపారు.

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

శరన్నవరాత్రులకు ఆలయాల ముస్తాబు

ధర్మవరం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ధర్మవరం పట్టణంలోని అమ్మవారి ఆలయాలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం నుంచి శరన్నవరాత్రులు నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు సిద్ధం చేశాయి. పట్టణంలోని దుర్గమ్మ, గాయత్రి, కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి అమ్మవారి ఆలయాలను ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణల్లో 9 రోజుల పాటు అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.


విద్యుద్దీపాలంకరణలో కన్యకాపరమేశ్వరీ ఆలయం

రహదారిపై విరిగిపడిన చెట్టు తొలగింపు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలో గాంధీనగర్ శ్మశానవాటిక సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న భారీ వృక్షాన్ని లారీ ఢీకొనడంతో విరిగి రోడ్డుపై అడ్డుగా పడింది. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ సిబ్బందికి విషయం తెలియడంతో అక్కడకు చేరుకొని శ్రమదానం చేశారు. అరగంటలోపే చెట్టు కొమ్మలను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. యథావిధిగా వాహనాల రాకపోకలు సాగాయి. మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రహదారిపై చెట్టును తొలగిస్తున్న మంత్రి సత్యకుమార్ కార్యాలయ సిబ్బంది

పూర్వీకుల సమాధుల వద్ద దీపారాధన

ధర్మవరం, న్యూస్‌టుడే: మహాలయ పక్ష అమావాస్య సందర్భంగా బుధవారం ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్ శ్మశానవాటికను విద్యుద్దీపాలతో అలంకరించారు. పితృదేవతలను స్మరించుకుంటూ వారికి ఇష్టమైన పదార్థాలను సమాధుల వద్ద వుంచి పితృదేవతల ఆశీర్వాదాలు కోరారు. ఈ సందర్భంగా పితృదేవతలకు అంజలి ఘటించారు. పట్టణంలోని నామదార్ల కుటుంబాల వారు ఏటా మహాలయపక్ష అమావాస్య రోజున శ్మశానవాటికకు వెళ్లి వారి పూర్వీకుల సమాధులను పూలతో అలంకరించి దీపారాధన చేస్తారు. తమ పూర్వీకులకు ఇష్టమైన పదార్థాలు, దుస్తులను సమాధులపై ఉంచారు. శ్మశానవాటిక వద్ద పురపాలక శాఖ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు.


సమాధుల వద్ద పూజలు చేస్తున్న ప్రజలు

నేడు ఇంటింటికీ గ్యాస్ పైపులైన్ ప్రారంభం

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పైపులైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరాకు శ్రీకారం చుట్టబోతున్నట్లు నిర్వాహకులు మహేష్, ప్రేమ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కప్పలబండ ఏపీ ఇండస్ట్రియల్ ఎంఎస్ఎంఈ పార్కులో ఏజీ-పీ ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో సీఎన్‌జీ-డీసీయూ స్టేషన్ నుంచి పైపులద్వారా సహజ (సీఎన్‌జీ) వంటగ్యాస్‌ను సరఫరా చేసే పథకాన్ని గురువారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత ప్రశాంతి నిలయానికి సరఫరా ఇవ్వనున్నట్లు తెలిపారు. దశలవారీగా గృహాలకు సరఫరా చేస్తామని చెప్పారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీలు హాజరవుతారని వివరించారు.

మున్సిపాలిటీల్లో అద్దె వాహనాలపై మమకారం

• మరమ్మతులకు నోచుకోక తుప్పుపడుతున్న యంత్రాలు


కదిరిలో పిచ్చిమొక్కల మధ్యలో కంపాక్టర్

ధర్మవరం పట్టణం, పుట్టపర్తి, కదిరి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీల్లో సొంత వాహనాలకు మరమ్మతులు చేయించలేక అద్దె వాహనాలపై అధికారులు మమకారం చూపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. మరమ్మతులకు గురైన వాహనాలను తక్కువ ఖర్చుతో రిపేరి చేయించడం వదిలేసి ప్రతి నెలా రూ.లక్షల్లో అద్దెలు చెల్లించి మరీ వాహనాలను తీసుకుంటుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా రూ.లక్షలు విలువచేసే వాహనాలు మూలకు చేరుతున్నాయి. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి మున్సిపాలిటీల్లో అధికారులు ప్రతి నెలా పన్నుల రూపంలో రూ.లక్షలు వసూలు చేస్తున్న అధికారులు ప్రజలకు ఉపయోగపడే వాహనాలను మాత్రం మరమ్మతులు చేయించడం లేదు. దీంతో చెత్తను తరలించే, తాగునీరును సరఫరా చేసే వాహనాలు తుప్పుపడుతున్నాయి.

ఏడాదికి రూ.అరకోటి చెల్లింపులు

ఈ మూడు మున్సిపాలిటీ పరిధిలో అద్దె వాహనాలకు ఏడాదికి రూ.అరకోటికి పైగానే చెల్లించారంటే మున్సిపాలిటీ నిధులు ఏవిధంగా దుర్వినియోగం అవుతున్నాయో గమనించవచ్చు. ఈ లెక్కల 5 ఏళ్లలో సుమారుగా రూ.మూడు, నాలుగు కోట్లు అద్దెల రూపంలో చెల్లించేశారు. వాహనాలకు పోసే డీజిల్, వాటి బాడుగల ధరలు తక్కువగా ఉన్నా రోజూ రూ.2,000 చెల్లించేలా అధికారులు గుత్తేదారులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ మూడు మున్సిపాలిటీల్లో 12, 13 వాహనాలను అద్దెకు తీసుకుని పనులు చేయించారు. కూటమి ప్రభుత్వం రాగానే కొన్ని మున్సిపాలిటీల్లో వాటిని నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు.


ధర్మవరంలో తుప్పుపడుతున్న తాగునీటి ట్యాంకరు

వాహనాలకు మరమ్మతులు చేయిస్తాం

వచ్చే కౌన్సిల్ సమావేశంలో వీటిపై ప్రస్తావించి, మరమ్మతులకు గురైన ప్రతి వాహనాన్ని బాగా చేయిస్తాం. మున్సిపాలిటీకి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటాం.

- ప్రహ్లాద, కిరణ్‌కుమార్, పుట్టపర్తి, కదిరి మున్సిపల్ కమిషనర్లు

నాయకుల కనుసన్నల్లోనే..

వైకాపా ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలపై ఆ పార్టీ నాయకులు పెత్తనం చెలాయించారు. అన్ని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకోవడంతో వారు చేయని అవినీతి, అక్రమాలు లేవు. మున్సిపాలిటీలకు సంబంధించిన వాహనాలు చిన్నపాటి మరమ్మతులకు గురైనా.. వాటిని బాగుచేయించకుండా తమ బినామీ పేర్లతో అద్దె వాహనాలు ఏర్పాటు చేయించి నిధులు దోచేశారు. కౌన్సిల్ సమావేశంలో చర్చించకుండా, టెండర్ వేయకుండా, ప్రతిపక్ష కౌన్సిలర్లను అడగకుండానే అద్దె వాహనాలపై నిర్ణయం తీసుకునేవారు. ఈ అవినీతి, అక్రమాలకు కొందరు కార్యాలయ ఉన్నతాధికారులు పూర్తిగా సహకరించడంతో మున్సిపాలిటీకి ఆదాయం రానూరానూ తగ్గిపోయింది.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



సమస్య: మామిళ్లపల్లి, ముక్తాపురం వీధుల్లో ఏర్పాటు చేసిన మురుగు కాల్వల్లో మురుగుతో దుర్గంధం వస్తోంది. **- ప్రసాద్, స్థానికుడు**

సమాధానం: మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం

- వెంకటరమణ, మోహన్, పంచాయతీ కార్యదర్శులు

సమస్య: తగరకుంట రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోయాయి. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- రవి, స్థానికుడు.**

సమాధానం: రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను తొలగిస్తాం. **- మనోహర్, పంచాయతీ కార్యదర్శి, తగరకుంట**

సమస్య: కొడవండ్లపల్లి నుంచి బూదనాంపల్లికి వెళ్లే మార్గంలో ముళ్లచెట్లు పెరిగాయి. మలుపులో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. **- రవీంద్ర, బూదనాంపల్లి రైతు**

సమాధానం: కంపచెట్లు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

- ప్రమోద్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: ఎస్.బండ్లపల్లిలో ప్రధాన రహదారిపై మురుగు నిలబడుతోంది. దోమల బెడద విపరీతంగా ఉంది. **- కాటిమయ్య, ఎస్.బండ్లపల్లి**

సమస్య: ముదిగుబ్బ శివారులో జాతీయ రహదారికి ఆనుకుని చెత్త వేస్తున్నారు. పొగపెట్టిన సమయంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **- నరేష్, ముదిగుబ్బ**

సమాధానం: మురుగు నిల్వలేకుండా శుభ్రం చేయించి దోమల బెడదకు మందు పిచికారీ చేయిస్తాం. చెత్తను సంపద కేంద్రాలకు తరలిస్తాం. (పై రెండు సమస్యలకు ఈవోఆర్డీ కృష్ణకుమార్ సమాధానమిచ్చారు.)

– న్యూస్‌టుడే, కనగానపల్లి, ముదిగుబ్బ

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపేయండి'

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: అనేక పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నాయని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపేయాలని కోరుతూ విజయవాడలో కార్మికులు దీక్షలు చేస్తున్నారు. వారికి మద్దతుగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో 75 లక్షల టన్నులు ఉత్పత్తి చేయడానికి వీలున్నా.. కేవలం 25 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని, ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రని విమర్శించారు. ఉక్కును పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేసేందుకు అవకాశమున్నా.. దాన్ని ఆపే కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు జేవీ రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, నాయకులు ఆయూబ్‌ఖాన్, ఆదినారాయణ, పోతక్క, ఫాతిమా, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


పట్టణంలో సీఐటీయూ నాయకుల ప్రదర్శన

వరద బాధితులకు విద్యార్థుల సాయం

ముదిగుబ్బ: విజయవాడలోని వరదబాధితుల కోసం ముదిగుబ్బలోని పీవీఎస్ పాఠశాల తరఫున రూ.12,500 ముఖ్యమంత్రి సహాయనిధికి జమచేసినట్లు ఛైర్మన్ పీవీ నాయుడు బుధవారం తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తనవంతు సహాయం చేస్తున్నామని, విద్యార్థి దశనుంచే సహాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు.

భాజపా నాయకుల రక్తదానం

కదిరి పట్టణం : జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రిల జయంతి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుసేన్ రక్తదాతలను అభినందించారు. ఉత్తమరెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, అంజనేయులు, హరినాయక్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ప్రపంచ శాంతిదూత గాంధీజీ

ఆంగ్లేయుల తూటాలకు బెదరక శాంతి అనే ఆయుధంతో భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించి ప్రపంచంలో ఎన్నో దేశాల స్వాతంత్ర్య సముపార్జనకు బాటలు వేసిన ప్రపంచ శాంతిదూత గాంధీజీ అని వక్తలు పేర్కొన్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో వైభవంగా నిర్వహించారు. సత్యం, అహింసలే ఆయుధాలుగా గాంధీజీ భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికారని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం, రోటరీ క్లబ్, లయన్స్‌క్లబ్, బీసీ సంక్షేమ సంఘం, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

– న్యూస్‌టుడే బృందం


భాజపా జిల్లా కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పుట్టపర్తి పట్టణం: ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న


కదిరి: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్


కొత్తచెరువు: గాంధీజీకి నివాళులర్పిస్తున్న డీఈవో మీనాక్షి


కనగానపల్లి : కనగానపల్లి మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేసిన అనంతరం నిత్యావసరాలను అందజేస్తున్న అధికారులు, పాలకవర్గ సభ్యులు


సమష్టి కృషితో ఆరోగ్య సమాజం

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్ర గ్రామాలు సాధ్యమవుతాయని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. బుధవారం కప్పలబండ గ్రామం ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ముగింపు సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య కార్మికులు కాలువలు, రోడ్లు, వీధులు శుభ్రం చేయడం వల్లనే మనమంతా ఆరోగ్యంగా ఉన్నామన్నారు. ప్రజాప్రతినిధులకిచ్చే గౌరవాన్ని సఫాయి కార్మికులకూ ఇవ్వాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులు, అందుకు కృషి చేసిన ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కళాకారులను కలెక్టర్ శాలువ, పూల దండలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు చిన్నపెద్దన్న, లక్ష్మీదేవీ, ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీటీసీ మధురిమ, డీపీవో శివకుమారి, మండల ఎస్‌వో శుభదాస్, తహసీల్దార్ అనుపమ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు, మండల అధికారులతో కలెక్టర్ టీఎస్ చేతన్

గ్రామీణ క్రికెట్ లీగ్ పోటీలు ఆరంభం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా క్రికెట్టు అసోసియేషన్, ఆర్డీటీ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న 40 ఓవర్ల రూరల్ క్రికెట్టు లీగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. బుధవారం పట్టణంలోని ఆర్డీటీ క్రికెట్టు మైదానంలో హిందూపురం, ధర్మవరం జట్లు పోటీపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ధర్మవరం జట్టు 213 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులోని తేజశ్వర్‌రెడ్డి 92 పరుగులతో సత్తాచాటాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిందూపురం జట్టు 169 పరుగులు చేసింది. ధర్మవరం జట్టు 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. ధర్మవరం జట్టులోని తేజశ్వర్‌రెడ్డి బ్యాటింగ్‌లో 92 పరుగులు చేసి, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఆల్‌రౌండర్ ప్రతిభ చాటాడు. హిందూపురం జట్టులోని తేజశ్వనిసాయి బౌలింగ్‌లో 4 వికెట్లు తీసి సత్తాచాటాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ క్రికెట్టు లీగ్ పోటీల్లో 18 జట్లు పాల్గొంటాయని శిక్షకుడు రాజశేఖర్, ఆర్డీటీ ఏరియా టీం లీడర్ శ్రీనివాసులు తెలిపారు.


తేజశ్వర్‌రెడ్డి

నిస్వార్థ సేవలతో దైవత్వం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: నిస్వార్థంతో సేవలందిస్తే తప్పక దైవత్వం సిద్ధిస్తుందని, సత్యసాయి మానవాళికి అందించిన సేవ, ప్రేమతత్వాన్ని అలవరచుకోవాలని చిన్నారులు నృత్యనాటిక ద్వారా సందేశం ఇచ్చారు. సత్యసాయి మహాసమాధి దర్శనార్థం మహబూబ్‌నగర్ జిల్లా భక్తులు పర్తియాత్రతో పుట్టపర్తి వచ్చారు. గురువారం సాయికుల్వంత్ మందిరంలో ఉదయం మహాసమాధి చెంత వేదపఠనం పఠించి, సత్యసాయి గీతాలు ఆలపిస్తూ వేడుకలను ప్రారంభించారు. ప్రపంచశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి అష్టోత్తర నామాన్ని భక్తిశ్రద్ధలతో పఠించారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు ''దంత వేదాంతం'' నృత్య నాటికను ప్రదర్శించారు. చిన్నారులకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ వస్త్రాలు అందజేసి అభినందించారు. సత్యసాయి మహాసమాధిని భక్తులు దర్శించుకున్నారు.


చిన్నారుల నృత్య ప్రదర్శన

మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు లేక ఆవేదన చెందుతున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తున్నా.. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం లేదని వాపోయారు. ఉన్నత పాఠశాల్లో బోధన కుంటుపడకుండా సబ్జెక్టుల వారీగా భాషోపాధ్యాయులకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. యూటీఎఫ్ సంఘం నాయకులు రామకృష్ణనాయక్, హరికృష్ణ, సాయిగణేష్, లక్ష్మయ్య, మేరీవరకుమారి, లతాదేవి, నాగేంద్రమ్మ, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నూతన మద్యం విధానం అమలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన మద్యం విధానాన్ని పారదర్శకంగా అమలు చేయడం జరుగుతుందని జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 87 మద్యం దుకాణాలకు ఈనెల 9వ తేదీ సాయంత్రం వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. 32 మండలాల్లో 58, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 28 మద్యం దుకాణాలకు ప్రకటన విడుదల చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అమడగూరు: మండల పరిధిలోని మహ్మదాబాద్ గ్రామ సమీపంలో అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించినట్లు బుధవారం ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. ఓబుళదేవరచెరువు మండలం మహ్మదాబాద్‌క్రాస్ నుంచి మండలంలోని వివిధ గ్రామాలకు నిత్యం అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వివరించారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం

నంబులపూలకుంట (గాండ్లపెంట): ఎన్పీకుంట మండలంలో సచివాలయం-2 సిబ్బంది మంగళవారం విధులు ముగిసిన అనంతరం సచివాలయానికి తాళం వేయకుండా వెళ్లిపోయారు. ఇది సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సచివాలయం తెరచియున్న ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. విలువైన సామగ్రి ఉన్న సచివాలయానికి తాళం వేయకుండాపోవడం సమంజసం కాదని విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై ఎంపీడీవో మనోహర్‌బాబును వివరణ కోరగా సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ చేయడానికి వెళ్లడంతో కొంత ఆలస్యమైందని చెప్పినట్లు తెలిపారు. అనంతరం సచివాలయానికి తాళం వేసినట్లు చెప్పారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.


తలుపులు వేయని కార్యాలయం


పొక్లెయిన్ల జప్తు

ఈనాడు కథనానికి స్పందన

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని చదునుచేసి పునాదులు వేస్తున్నవారిని రెవెన్యూ సిబ్బంది అడ్డుకుని మూడు పొక్లెయిన్లను కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 'ప్రభుత్వభూమిలో పట్టాల పందేరం' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ సిబ్బంది అనుమతి లేకుండా సర్వేనంబరు 94లో ప్రభుత్వ గుట్టను చదును చేస్తున్న వారిని అడ్డుకున్నారు. పోలీసుల సహకారంతో పొక్లెయిన్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ భూమికి సమీపంలో గతంలో భవన నిర్మాణ కార్మికులకు పట్టాలు ఇచ్చారు. దీన్ని అదనుగా చేసుకుని గుట్టను చదును చేస్తూ నిర్మాణాలు చేపడుతున్న రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు.


చదును చేస్తున్న పొక్లెయిన్‌ను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

వర్షాభావం.. పంటలకు తీవ్ర నష్టం



రైతన్నలకు ఎటు చూసినా కష్టాలే ఎదురవుతున్నాయి. ఏడాది తెగుళ్లు, చీడపీడలతో నష్టపోతున్న రైతులు మరో ఏడాది అతివృష్టి- అనావృష్టితో పంటలు దెబ్బతిని కుదేలవుతున్నాడు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో మెట్ట భూముల్లో పలువురు రైతులు వేరుసెనగ సాగు చేశారు. ఇటీవల వర్షాభావం నెలకొనడంతో రామగిరి మండలం కొత్తపల్లి వద్ద వేరుసెనగ పంట పూర్తిగా ఎండి పోయింది.

– న్యూస్‌టుడే, రామగిరి

మందుబాబులకు అడ్డాగా చెత్త సంపద కేంద్రం



సీకేపల్లి మండలం న్యామద్దలలో చెత్త సంపద కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. పంచాయతీ గ్రామాల నుంచి చెత్తను సేకరించి కేంద్రానికి చేరవేసి అక్కడ తడి, పొడి చెత్తలను వేరుచేసి సంపదగా మార్చాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశం. వైకాపా ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయి. చాలా కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మందుబాబులు వాటిలో చేరి పూటుగా మద్యం తాగడం, సీసాలు అక్కడే పగలగొట్టడం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వాటికి అడ్డుకట్టవేసి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, న్యామద్దల (చెన్నేకొత్తపల్లి)

రహదారి ఛిద్రం.. అధికారుల చోద్యం



తనకల్లు మండలంలోని కొక్కంటి గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డు పాడవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గ్రామంలోని నివాస గృహాల నుంచి వృథానీరు నిత్యం రహదారిపైకి రావడంతో దారి మొత్తం గుంతలు ఏర్పడింది. ఫలితంగా తిమ్మమ్మమరిమాను, నంబులపూలకుంట, కొర్తికోటకు వెళ్లే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి కార్యదర్శి బాబ్జాన్‌ను వివరణ కోరగా మురుగుకాలువ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. మంజూరు కాగానే ఏర్పాటు చేస్తామని వివరించారు.

– న్యూస్‌టుడే, తనకల్లు